క్లుప్తంగా

వృత్తి విద్యలో రాణించాలి

చిత్తూరు రూరల్: విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ఈ అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకుని విద్యావ్యవస్థల్లో రాణించాలని జెడ్పీటీసీ ఎం.ఎస్‌బాబునాయుడు అన్నారు. చిత్తూరు మండలం బీఎస్‌ఆర్‌పేట ఐటీఐలో గురువారం స్నాతకోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాంబమూర్తి పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలి



తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

తవణంపల్లె: పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలని చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి ఆదేశించారు. తవణంపల్లె పోలీస్ స్టేషన్‌ను గురువారం వార్షిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసుల పనితీరుపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ ఆవరణం ఆహ్లాదకరంగా ఉందన్నారు. డీఎస్పీ తోపాటు చిత్తూరు రూరల్ సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐ సుధాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు నగర మేయర్ ఎస్ అముద తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభవుతుందన్నారు. ఈ సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యులు, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని ఆమె కోరారు.

మొబైల్ ఫోన్లు నిజాయితీతో అందజేత

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ సిబ్బంది దొరికిన రెండు మొబైల్ ఫోన్లను గురువారం వన్‌టౌన్‌సీఐ విశ్వనాథరెడ్డికి అందజేసి నిజాయితీని చాటుకున్నాడు. చిత్తూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న హరికి రెండు మొబైల్ ఫోన్లు చిక్కాయి. ఈ ఫోన్లను ఆయన మొబైల్ షాప్ అసోసియేషన్ సభ్యులకు అప్పగించాడు. ఈ మేరకు వారు సీఐని కలిసి ఈ ఫోన్లను అందజేశారు. దీంతో ఆయన వారిని అభినందించారు.

జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని గుండ్లకట్టమంచి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం రామారావు తెలిపారు. బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారన్నారు. అండర్–14 బాలికల విభాగంలో నిహారిక, పవిత్ర, స్వాతి, అండర్–17 విభాగంలో హేమంత్ ధరణీదేవి, ద్రాక్షాయణి, భావన ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ప్యాక్‌హౌస్‌కు రాయితీ

బంగారుపాళెం: మామిడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధనరెడ్డి తెలిపారు. మండలంలోని తిమ్మోజుపల్లె, గొల్లపల్లె గ్రామాల్లో ఉద్యానశాఖ ద్వారా నిర్మించిన ప్యాక్ హౌస్‌లను గురువారం ఆయన పరిశీలించారు. మధుసూదనరెడ్డి మాట్లాడుతూ, రైతులకు మామిడి తోటల్లో ప్యాక్ హౌస్‌లను నిర్మించుకునేందుకు ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పిస్తోందన్నారు. 20 అడుగుల వెడల్పు 30 అడుగుల పొడవు 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్యాక్‌హౌస్‌లను నిర్మించుకుంటే రూ.4 లక్షలు ఖర్చు అవుతోందన్నారు. ఉద్యానశాఖ 50 శాతం అంటే రూ 2 లక్షలు అందిస్తుందన్నారు. ప్యాక్ హౌస్‌లను నిర్మించుకోవడం వల్ల పండిన పంటను రైతులు ప్యాక్ చేసుకుని అక్కడి నుంచే మార్కెటింగ్ చేసుకునేందుకు వీలు ఉంటుందన్నారు. రైతులు ప్యాక్ హౌస్‌ల నిర్మాణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఉద్యానశాఖ అధికారి లక్ష్మీప్రసూన, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం



సచివాలయంలో జేసీ శ్రీనివాసులు

పూతలపట్టు: జగనన్న లేఅవుట్లలోని నిర్మాణాలను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని తేనేపల్లి లేఅవుట్లను గురువారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ మరుగుదొడ్లను తప్పకుండా నిర్మించుకోవాలని సూచించారు. వాటితోపాటు ఇళ్ల నిర్మాణ పనులను పూర్తిచేయాలని సూచించారు. తేనేపల్లి గ్రామ సచివాలయాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమగ్రశిక్ష ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీఓ గౌరి, హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, ఏఈ శ్రీధర్, ఎంఈఓ కోటీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ భరోసా

- చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల పర్యవేక్షణ
- వైద్య శిబిరాలకు విశేష స్పందన



గుడిపాల: వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



పూతలపట్టు: జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను ప్రదర్శిస్తున్న బాబురెడ్డి, అధికారులు

చిత్తూరు అర్బన్: వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇస్తోందని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో గురువారం గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, మేయర్ ఎస్ అముద పరిశీలించారు. వారు వైద్య శిబిరంలోని అన్ని కౌంటర్లను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఐసీడీఎస్, డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించారు. ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడుతూ, కుటుంబంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ వైద్యాన్ని తీసుకొచ్చారని, ఇంటి వద్దకే వచ్చి వైద్య పరీక్షలు చేస్తుండడం పేదలకు మేలు జరుగుతుందన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. వైద్య శిబిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్‌ఓ లోకేష్, సీఎంఎం గోపి, స్థానిక కార్పొరేటర్లు, వార్డు కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష

గుడిపాల: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని 189 కొత్తపల్లె సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సర్పంచ్ పెరిల్లా అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా అంధత్వ సంస్థ ఆధ్వర్యంలో పలువురికి కంటి అద్దాలను ఆయన అందజేశారు. 323 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, వైద్యాధికారులు కీర్తిప్రియ, శేషగిరి, రష్మిత, హరి, డెప్యూటీ తహసీల్దార్ కల్యాణి పాల్గొన్నారు.

ఉచితంగా కార్పొరేట్ వైద్యం

ఐరాల: గ్రామాల్లో కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ మోహన్ అన్నారు. మండలంలోని నాగంవాండ్లపల్లె సచివాలయ ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు 270 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అంగన్‌వాడీ ద్వారా అందించే పౌష్టికాహార ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, చందన, ఎంపీడీఓ నాగరాజు, ఈఓపీఆర్డీ కుసుమకుమారి, సర్పంచ్ శ్రీనివాసులు, వైస్ సర్పంచ్ మునిరామయ్య పాల్గొన్నారు.

వైద్యంతో పేదలకు భరోసా

చిత్తూరు రూరల్: వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం పలు మార్పులు తీసుకొస్తూ పేదలకు భరోసా ఇస్తోందని జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు అన్నారు. చిత్తూరు మండలం పాలూరు గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ప్రజలకు చికిత్స చేసి మందులు, మాత్రలు, కళ్లద్దాలు అందజేశారు. శిబిరంలో 389 మంది వైద్య పరీక్షలు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపమ్మాల్, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ త్యాగరాజులు, నాయకులు రాము, వేలుస్వామి, మురగ పాల్గొన్నారు.

సురక్ష శిబిరానికి అనూహ్య స్పందన

తవణంపల్లె: మండలంలోని గోవిందరెడ్డిపల్లె సచివాలయం పరిధిలోని గాజులపల్లె పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మండల ఇన్‌చార్జి ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, సర్పంచ్ సురేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు హరిరెడ్డి ప్రారంభించి ప్రసంగించారు. శిబిరంలో మండల వైద్యాధికారులు ప్రియాంక, ధాత్రేయచౌదరి, మోహన్‌వేలు, వినయ్‌కుమార్, అపోలో హాస్పిటల్ వైద్యులు, ప్రత్యేక వైద్య నిపుణులచే 408 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎనిమిది మందిని మెరుగైన వైద్యం కోసం రెఫరల్ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన వంటలు, ఆకుకూరలు, తాజా కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్య బృందం, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజలకు ఆరోగ్య భరోసా

బంగారుపాళెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదప్రజలకు ఆరోగ్య భరోసా కలుగుతోందని స్థానిక సర్పంచ్ షర్మిల, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌రెడ్డి అన్నారు. మండలంలోని మహాసముద్రం గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఎంపీపీ అమరావతి ప్రారంభించారు. వైద్య శిబిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్, డాక్టర్లు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శ్రీ రామ రక్ష

పూతలపట్టు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు శ్రీ రామ రక్షగా నిలుస్తున్నాయని వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి అన్నారు. మండలంలోని తలపులపల్లి పంచాయతీ పరిధిలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 237 మంది పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. అనంతరం రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష బ్యాగును అందజేశారు. కంటిచూపు లోపం ఉన్నవాళ్లకు ఉచిత కంటి అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, సర్పంచ్ సుధారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, వైస్‌ఎంపీపీ ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.






చిత్తూరు: కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కళ్ల అద్దాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబు నాయుడు, బంగారుపాళెం: సురక్ష కిట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, తవణంపల్లె: గాజులపల్లెలో సురక్ష ఉచిత వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ గురువారం ఎంఎస్సీ రసాయనశాస్త్రం బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఎంఎస్సీ రసాయనశాస్త్రంలో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఇతర వివరాలకు 9182320973ను సంప్రదించాలని ప్రిన్సిపల్ జీవనజ్యోతి కోరారు.

రామాలయంలో 16 నుంచి బ్రహ్మోత్సవాలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో ఈ నెల 16 తేదీ నుంచి నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు అర్చకులు వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పదిరోజుల పాటు సాయంత్రం స్వామి వారు వివిధ అవతారాల్లో భక్తులకు అభయమివ్వనున్నారు. మొదట 16వ తేదీన మత్స్యావతారం, 17న కూర్మావతారం, 18న వరహావతారం, 19న నరసింహావతారం, 20న వామనావతారం, 21న పరుశురామావతారం, 22న రామావతారం, 23న బలరామావతారం, 24న కృష్ణావతారంలో కనిపించనున్నారు. నేపథ్యంలో ఆలయంలో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

జేసీబీ డ్రైవర్ గుండెపోటుతో మృతి

తవణంపల్లె: జేసీబీ డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు, మండలంలోని జి.వడ్డిపల్లెకు చెందిన బాలాజి కుమారుడు శ్రీకాంత్ (22) జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఐరాల క్రాస్‌లో జేసీబీ వాటర్ సర్వీస్ కోసం తీసుకెళ్లాడు. అక్కడ నిలబడి ఉండగా అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని తల్లి శిరీషా ఫిర్యాదు మేరకు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

శారదకు టౌన్ ప్లానింగ్ అధికారిగా పదోన్నతి



శారద

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న శారదకు పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమెకు టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీఓ)గా పదోన్నతి కలిప్తూ, వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మున్సిపాలిటీకి బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

15న వరసిద్ధుని కల్యాణోత్సవం

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానంలో 15న ఆదివారం సాయంత్రం వరసిద్ధి వినాయకస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వసంతాపురం సర్పంచ్ రజినీకాంత్ తెలిపారు. కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ధర్మప్రచార రథం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ప్రవచనాలు, భజనలు, కోలాటాలు, చెక్కభజనలు, భక్తిగీతాలు నిర్వహించనున్నారు. గోపూజ, గణపతిహోమం, వినాయకస్వామి కల్యాణోత్సవం ఉంటుందని చెప్పారు.

నేడు చిత్తూరు పీవీకేఎన్‌లో జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 13న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఎస్‌డీవో గుణశేఖర్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ జాబ్‌మేళాలో పలు ప్రఖ్యాత కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. ఐటీఐ, ఏదైనా డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. పాల్గొనే పురుష, స్త్రీ అభ్యర్థులకు 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయసు ఉండాలని చెప్పారు. ఎంపికయ్యే వారు చిత్తూరు, తిరుపతి, కడప, అనంతపురం, చెన్నై ఇతర ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. 200 ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికయ్యే వారికి నెలకు కనీస జీతం రూ.10 వేల నుంచి రూ.30,200 వరకు ఉంటుందన్నారు. పనిరోజుల్లో రవాణా, భోజన వసతి ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల నైపుణ్యాన్ని బట్టి జీతం పెరుగుదల ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్ల తోపాటు, 4 ఫొటోలు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు 7893110120, 8121984041ను సంప్రదించాలని కోరారు.

జగనన్న పాల వెల్లువపై ఇంటింటి సర్వే



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, వెటర్నరీ అధికారి డాక్టర్ లావణ్య

తవణంపల్లె: జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా అమూల్ డెయిరీ పాల సేకరణ కోసం ఇంటింటి సర్వే చేయాలని తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, వెటర్నరీ అధికారి డాక్టర్ లావణ్య తెలిపారు. మండలంలోని మత్యం, పుణ్యసముద్రం గ్రామాల్లో గురువారం అవగాహన కల్పించారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా మండలంలో 30 గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి 24 వరకు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి ఇవ్వాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సచివాలయంలోని వలంటీర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, వెటర్నరీ, వ్యవసాయ అసిస్టెంట్లు సర్వేలో పాల్గొనాలని స్పష్టం చేశారు. అమూల్ డెయిరీకి మూడు నెలల పాటు పాలు సరఫరా చేసే రైతులకు ఆవులు కొనుగోలుకు రుణాలు ఇస్తారని చెప్పారు. ఆరు నెలల పాటు మధ్యలో నిలపకుండా పాలు సరఫరా చేసే రైతులకు ప్రోత్సాహకరంగా బోనస్ ఇస్తారని వివరించారు.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం




లారీలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడిన బియ్యం, పట్టుబడిన బియ్యాన్ని లారీ నుంచి దించుతున్న సిబ్బంది (ఫైల్)

- రేషన్‌పై బియ్యం పంపిణీపై నిఘా
- 6ఏ కేసులు నమోదు చేసేందుకు చర్యలు
- ప్రత్యేక యాప్‌లో రియల్ టైం మానిటరింగ్

చిత్తూరు రూరల్: పేదల బియ్యాన్ని బొక్కే అక్రమార్కులపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. పటిష్ట చర్యలతో బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెడుతోంది. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తోంది. చౌక ధరల దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేసే నిత్యావసరాలను దారి మళ్లించిన, దుర్వినియోగానికి పాల్పడిన వారిపై 6ఏ కేసులతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తోంది. ఇప్పుడు దీర్ఘకాలికంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్ చేస్తూ తరచూ పట్టుబడిన వ్యక్తులపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తోంది. చిత్తూరు అర్బన్, రూరల్ మండలాల పరిధిలో 120 రేషన్ షాపులున్నాయి. 32 ఎండీయూ వాహనాల ద్వారా 35వేల కార్డుదారులకు రేషన్ సరఫరా జరుగుతోంది. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా 1250 టన్నుల రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తోంది. ఈ బియ్యం సరఫరా తర్వాత అక్రమ వ్యాపారం జోరు పుంజుకుంది.

సన్నబియ్యంగా మార్చి...

రేషన్ బియ్యం విచ్చలవిడిగా అక్రమ రవాణా జరుగుతోంది. వందల టన్నుల బియ్యం సరిహద్దులు దాటుతోంది. మరో పక్క పేదలు తినే బియ్యాన్ని తక్కువధరకు కొని తిరిగి పాలిష్ పట్టి మార్కెట్లోకి తెచ్చి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై టీడీపీ ప్రభుత్వంలో పట్టించుకునే వారు. ఇప్పుడు వదిలిపెట్టే ప్రసక్తే కనిపించడం లేదు. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇలాంటి అక్రమార్కుల ఆట కట్టిస్తోంది. రేషన్ బియ్యం రవాణాపై నిఘాను పటిష్టం చేసింది. అంతర్రాష్ట్ర సరిహద్దులు, మండల నిల్వ పాయింట్లు, చౌకదుకాణాలు, ఎండీయూ వాహనాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిరంతర నిఘా పెట్టడంతో చాలావరకు అక్రమ రవాణా తగ్గిందని తెలుస్తోంది. నిత్యావసర వస్తువుల చట్టం – 1955 సెక్షన్–6ఏ ప్రకారం అక్రమ రవాణాలో పట్టుబడిన సరుకులు, వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తోంది. గత ఐదేళ్లలో అధికారులు 315 కేసులు నమోదు చేశారు. ఈ కేసులు సత్వరం పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుని అక్రమార్కులకు త్వరితగతిన శిక్షలు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పట్టుబడిన బియ్యాన్ని వెంటనే తిరిగి పీడీఎస్ మార్కెట్లోకి తెస్తోంది. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. బియ్యం అక్రమ రవాణాలో పట్టుబడిన సరుకుల నిల్వల విలువ రూ.50 లక్షల్లోపు ఉంటే జేసీలు, అంతకు పైబడి ఉంటే కలెక్టర్లకు కేసుల పరిష్కార బాధ్యతలను అప్పగించింది. ఫలితంగా సీజ్ చేసిన సరుకు ముక్కిపోయి పురుగులు పట్టి పాడవకుండా బహిరంగ వేలం ద్వారా వెంటనే తిరిగి మార్కెట్లోకి తెస్తోంది.

మానిటరింగ్ ఇలా...

ఎప్పటికప్పుడు 6ఏ కేసుల స్థితిగతులను ఆన్‌లైన్‌లో పర్యవేక్షించేందుకు పౌరసరఫరాల శాఖ ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేసింది. కేసు నమోదు చేసిన వెంటనే సీజ్ చేసిన స్టాక్ వివరాలను ఇందులో అప్లోడ్ చేస్తారు. ఇందులో తేదీలు, నెలల వారీగా నమోదైన కేసులు, పరిష్కరించినవి, సీజ్ చేసిన స్టాక్, బయటకు విడుదల చేసిన స్టాక్ వివరాలను రియల్ టైం మానిటరింగ్ చేసేలా ప్రత్యేక వ్యవస్థను రూపొందించింది. పీడీఎస్ బియ్యాన్ని దారి మళ్లించి వాటిని రీసైక్లింగ్ చేసి కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద చూపించడం, పాలిష్ పట్టి కొత్త ప్యాకింగ్‌లో మార్కెట్లో విక్రయించడాన్ని సంపూర్ణంగా నిరోధించే ప్రయత్నం చేస్తోంది.

అక్రమంగా తరలిస్తే కేసులు



ఇప్పటి వరకు అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి పక్కన పెట్టేవారు. వాటిని పట్టించుకోకపోవడంతో తినడానికి పనికిరాకుండా పాడయ్యేవి. ఈ క్రమంలోనే మేము 6ఏ కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టాం. కేసులు వేగంగా పరిష్కారమయ్యేలా పర్యవేక్షిస్తున్నాం. దీనికితోడు బ్లాక్ మార్కెట్ దందాకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తాం. ఇకపై అక్రమంగా రేషన్ వ్యాపారం చేస్తే చర్యలు కఠినతరంగా ఉంటాయి.

– శంకరన్, డీఎస్ఓ, చిత్తూరు

మంగళ విద్యావాణి సంచిక ఆవిష్కరణ



మంగళపల్లెలో మంగళవిద్యావాణి సంచికను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మంగళ విద్యావాణి 24వ పాఠశాల మాసపత్రికను హెచ్‌ఎం రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఆవిష్కరించారు. చిత్తూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దాత శ్రీధర్, ఉపాధ్యాయులు సంచికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, సంచికలో విద్యార్థులు రాసిన అంశాలు, గీసిన చిత్రాలు చాలా బాగున్నాయని అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి ప్రభాకర్, కోశాధికారి సమీర్, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్‌శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో ఐదుగురి అరెస్టు



నిందితులను అరెస్ట్ చూపిస్తున్న సీఐ విశ్వనాథరెడ్డి

చిత్తూరు అర్బన్: గత వారం చిత్తూరు నగరంలో ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ విశ్వనాథరెడ్డి కేసు వివరాలను గురువారం మీడియాకు వెల్లడించారు. చిత్తూరులోని కొంగారెడ్డిపల్లి సత్యనారాయణపురానికి చెందిన శివ కొత్తపల్లి మిట్ట, ఎస్ఆర్ పురం, చిత్తూరు నగరంలోని పలు ప్రాంతాల్లో బార్బర్ షాపులు నిర్వహిస్తున్నాడు. ఇతని వద్ద ఉత్తరభారతానికి చెందిన వాజిద్ అనే వ్యక్తి పని చేస్తుండేవాడు. అయితే వాజిద్, శివాను కాదని ఇటీవల మరొకరి వద్ద పనికి చేరాడు. తన వద్ద తీసుకున్న అడ్వాన్సులు తిరిగి చెల్లించని వాజిద్.. శివాపై పలుచోట్ల దుష్ప్రచారం చేశాడు. దీంతో ఆగ్రహించిన శివ ఈ నెల 6వ తేదీన తన స్నేహితులతో కలిసి వాజిద్‌ను కారులో కిడ్నాప్ చేశాడు. అతడిని చంపేసి రేణిగుంట రైల్వే స్టేషన్‌లో పడేయాలని ప్లాన్ చేశారు. బాధితుడిపై దాడి చేస్తుండగా స్థానికులు గమనించడంతో రేణిగుంట పరిసర ప్రాంతాల్లో వదిలి పరారయ్యారు. గాయపడిన నిందుతుడు ఆస్పత్రిలో చికిత్స పొందా ఇంటికి చేరాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదు మేరకు ఐదు మంది ఎ.శివ (34), కె.కిరణ్ కుమార్ (26), డి.జగదీష్ (34), వి.మురుగన్ (29), ఎ.వెంకటేష్ (25)ని అరెస్ట్ చేశారు. వారి నుంచి ఒక కారు, ఇనుపరాడ్, కర్రలను స్వాధీనం చేసుకున్నారు. న్యాయమూర్తి ఆదేశాలతో నిందితులను జిల్లా జైలుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, ఏఎస్ఐ హేమ, సిబ్బంది పాల్గొన్నారు.